# సాకేత్ పోట్లు

హిరణ్యకశిపుడు తన తనయునితో గురువుల చెంత నేర్చుకొనిన విద్యలను ప్రదర్శింపమని కోరగా పోతన గారు భక్తిమార్గపు మెళకువలను ప్రకటించుచు నాలుగు పద్యాలను ప్రహ్లాదుని నోట పలికించెను. అందులో ఇది ఒకటి.

కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే పవనగుంఫిత చర్మ భస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే ఢమ ఢమ ధ్వనితోడి ఢక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే తనుకుడ్యజాల రంధ్రములు గాక

చక్రి చింతలేని జన్మంబు జన్మమే / తరళ సలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే / పాదయుగముతోడి పశువు గాక. **(7.170)**

ఈ పద్యం యొక్క అర్థం **:** పద్మాలవంటి కన్నులు కలిగిన విష్ణుమూర్తికి పనికి రాని శరీరం కూడా ఒక శరీరమేనా**?** కాదు. అది గాలితో నిండిన**,** కొలిమిలో గాలి కొట్టుటకు ఉపయోగపడు**,** ఒక తోలు తిత్తి మాత్రమే. వైకుంఠవాసుడైన ఆ హరి నామం కీర్తించని నోరు నోరా**?** కాదు కాదు**,** ఢమ ఢమ అని మ్రోగు వాద్యం. హరిని పూజించని చేయి చేయి అవుతుందా**?** కాదు**,** అది ఒక చెక్క గరిటె. శ్రీపతిని చూడని కన్నులు కన్నులా**?** అవి ఈ శరీరం అనే గోడకి ఉన్న కిటికీలు మాత్రమే. చక్రాయుధుడు అయిన విష్ణుమూర్తిని ధ్యానించని ఆ జన్మ కూడా ఒక జన్మమేనా**?** అది క్షణికమైన నీటి బుడగ మాత్రమే. వైష్ణవ భక్తి లేని పండితుడు రెండు కాళ్ళ జంతువు తప్ప వాడు పండితుడు కానేకాదు. ఎంత చక్కటి భావమున్న పద్యమో కదా**!** మనం మన శరీరంతో ప్రతి దినం ఎన్నో పనులు చేస్తూ ఉంటాము. కానీ**,** నిష్కామమైన సేవ చేయడానికి నిరాకరిస్తాము. అటువంటి సమయం లో ఈ పద్యం గుర్తుకు తెచుకున్నట్లయితే మనపై ఆనందామృతం కురుస్తుంది.